క్లుప్తంగా

ఆర్‌ఎంపీ క్లినిక్‌ల తనిఖీ



ఆర్‌ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

బైరెడ్డిపల్లె: మండల పరిధిలో నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీ క్లినిక్‌లను బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. పలమనేరులో రెండు రోజుల క్రితం ఆర్‌ఎంపీ డాక్టర్ నిర్లక్ష్యం కారణంగా వైద్యం వికటించి ఇంటర్ విద్యార్థిని మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో మండలంలో ఆర్‌ఎంపీ వైద్యులు క్లినిక్‌లు నిర్వహిస్తుండడంతో తనిఖీలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని సూచించారు. సీహెచ్‌ఓ అనూరాధ, సిబ్బంది సావిత్రి, శ్రీదేవి, గోపి, హరి, నవీన, కవిత, సుజాత, భారతి పాల్గొన్నారు.

కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో ఈఎస్‌ఎఫ్ పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కుప్పంరూరల్: కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో ఈఎస్‌ఎఫ్ (ఇంటర్మేషనల్ స్టార్టప్ ఫౌండేషన్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఐడియాథాన్, రూరల్ స్టార్టప్ పోటీలను నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో భాగంగా చిత్తూరు రీజియన్‌కు సంబంధించిన పోటీలు నిర్వహించేందుకు కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఎంపికైనట్లు వైస్ చైర్మన్ డా. సునీల్‌రాజ్ చెప్పారు. ఈ పోటీలను సెప్టెంబర్ 13 నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలు సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 4 వరకు నిర్వహించే అంకురా బస్సు యాత్రల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు. నూతన ఆవిష్కరణలు, ఆలోచనలు ఉన్న వారు కళాశాలలో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ డా.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ భాస్కరన్, పీఆర్వో ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

550 మందికి కంటి పరీక్షలు



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కుప్పంరూరల్: ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. 550 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఎస్.కొత్తపల్లి వైద్యాధికారి డా.సుభాష్ తెలిపారు. మంగళవారం పైపాళ్యం గ్రామంలో 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించినట్లు చెప్పారు. ఆపరేషన్లు అవసరమైన వారిని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఆయన చెప్పారు. చిన్న సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మందులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అంతకుముందు పాఠశాల విద్యార్థులతో ర్యాలీ రూపంలో అవగాహన కల్పించినట్లు ఆయన చెప్పారు. వైద్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫార్మేటివ్ అసెస్‌మెంట్



ప్రశ్నాపత్రాలతో త్రిసభ్య కమిటీ సభ్యులు

పలమనేరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఫార్మేటివ్ అసెస్‌మెంట్(నిర్మాణాత్మక మూల్యాంకనం) నేటి నుంచి నిర్వహించనున్నట్టు ఎంఈఓ లీలారాణి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణపై ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీతో సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 1నుంచి 5 తరగతులకు పరీక్ష రోజు గంటకు ముందు ఆ కాంప్లెక్స్ హెచ్‌ఎం నుంచి 6 నుంచి 10 తరగతులకు ఎంఈఓ ఆఫీస్ నుంచి సంబంధిత హెచ్‌ఎంలు ప్రశ్నాపత్రాలను తీసుకోవాలన్నారు.

కోనేటిరాయుని ఆలయంలో గోకులాష్టమి



గంగవరం: శ్రీకృష్ణ గోకులాష్టమి వేడుకలు కీలపట్ల శ్రీ కోనేటిరాయ స్వామి ఆలయంలో మంగళవారం వైభవంగా జరిగాయి. కోనేటి రాయస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సమీంలోని స్వామివారి ఉద్యానవనంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని నూతనంగా ప్రతిష్ఠించారు. అనంతరం గోవులను పూజించారు. సాయంత్రం స్వామివారు శ్రీకృష్ణావతారంలో రుక్మిణి, సత్యభామ సమేతంగా తిరుచ్చిపైకి వేంచేసి పురవీధుల్లో విహరించారు.



మేము సురక్షితంగా ఉంటేనే సేవలు



ఆస్పత్రిలో మేము సురక్షితంగా ఉంటేనే రోగులకు ప్రశాంతంగా సేవలందిస్తాం. వైద్యులపైనే అత్యాచారాలు, దాడులు జరుగుతుంటే ఎవరికైనా భయమేకదా. దీనిపై ప్రభుత్వాలు గట్టి చట్టాలను తీసుకొచ్చి వాటిని పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే వైద్యులు ధైర్యంగా ఉంటారు.

డా. ఆషా, మెడికల్ ఆఫీసర్, అర్బన్ పీహెచ్‌సీ, పలమనేరు

చట్టాలంటే భయం లేదు



నేరం చేసే వారికి చట్టాలపై భయం లేదు. కోల్‌కతా ఘటన జరిగాక వైద్యులుగా మాకు రక్షణ అవసరం. మేము విధుల్లో ఉన్నప్పుడు రోగుల బంధువులు గొడవలకు దిగుతున్నారు. నైట్ డ్యూటీల్లో ఇలాంటి సమస్యలుంటాయి. ఆస్పత్రిలో పోలీస్ ఔట్‌పోస్ట్ ఉంటే నిర్భయంగా సేవలందిస్తాం.

డా.మాధవి, అప్తమాలజిస్ట్, పలమనేరు

రాత్రుల్లో భద్రత ఉండాలి



ప్రభుత్వాస్పత్రికి రాత్రుల్లో కాన్పు కేసులొస్తుంటాయి. అలాంటప్పుడు రాత్రుల్లోనూ ఆస్పత్రికెళ్లి సేవలందించాలి. అలాంటి సమయంలో భద్రతా సిబ్బంది అవసరం. కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాత్రుల్లో ఆస్పత్రిలో పోలీసులు ఉండాలి.

డా. మీనాసయ్యద్, గైనకాలజిస్ట్, పలమనేరు

తెలుగుభాషను రక్షించుకుందాం

- గిడుగు బాటలో పయనిద్దాం
- 29న తెలుగుభాషా దినోత్సవం
- తెలుగుభాషాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి
- అంతరించిపోకుండా తెలుగును కాపాడుకుందాం



గిడుగు రామమూర్తి (ఫైల్)



పలమనేరులో తెలుగుభాషా దినోత్సవం (ఫైల్)

పలమనేరు: తెలుగు భాషోద్యమం 1863 నుంచి ఇప్పటిదాకా నడుస్తోంది. దీనికి 1940లో గిడుగు రామమూర్తి స్ఫూర్తి ప్రదాత. నాలుగు దశాబ్దాల పాటు తెలుగుభాష కోసం తనను తాను అంకితం చేసుకున్న మహానుభావుడు ఆయన. దీన్నే అప్పట్లో వ్యవహారికా భాషోద్యమం అన్నారు. నాటి పండితుల మౌఢ్యాన్ని వదిలించి ప్రజలకు అర్థమయ్యేలా రచనలు జనంలోకి తెచ్చిన వారే గిడుగు. అందుకే గిడుగు జయంతి రోజున ఏటా ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఆయన అనంతరం తెలుగు భాష కోసం కందుకూరి విరేశలింగం, గురజాడ అప్పారావు, తాపీ ధర్మారావు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి లాంటి వారు ఎంతగానో కృషిచేశారు. నేడు తెలుగుభాష పట్ల సమాజంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. తల్లి భాషను రక్షించుకోవాల్సిన అవసరం నేటి సమాజంపై ఉందని తెలుగు భాషాభిమానులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం భావజాలపరంగా, బాషాపరంగా పరాయీకరణ ఎక్కువవుతోంది. ప్రజలు తమ మూలాలను మరచి తెగిన గాలిపటంలా తయారవుతున్నారు. పరాయి భాషలపై ఎంత మోజున్నా తెలుగును విస్మరించకుండా ఉండాలంటే అది తల్లిదండ్రుల చేతుల్లోనే ఉంటుంది. అందుకే మన మాతృభాష పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ కృరూ నడుం బిగించాల్సి ఉంది. అందుకే పలువురు తెలుగుభాషా ప్రేమికులు 20 కోట్ల మందికి పైగా మాట్లాడే తెలుగుభాషలోని కొన్ని వేల మాండలికాలను, మౌలిక పదాలను క్రోడీకరించాలంటున్నారు. వీలైనంతగా తెలుగు పదాలను మన భాషలో వాడేలా చూడాలి. ఈవిషయాన్ని మరింత ప్రచారంలోకి తీసుకురావాలి. ప్రాథమిక పాఠశాలల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు తెలుగు భాషను పటిష్టం చేయాలి. అప్పుడే గిడుగు రుణం తీర్చుకున్నవారమవుతాం. ఇలా ఉండగా జిల్లాలో కొందరు భాషాభిమానులు తెలుగుభాష ఉద్ధరణ కోసం కృషిచేస్తూనే ఉన్నారు. గత కొన్నేళ్లుగా ఈ సంస్థలు తెలుగుభాష కోసం కృషిచేస్తున్న కవులు, రచయితలను సన్మానిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నాయి. పిల్లలకు సైతం తెలుగుభాషపై మక్కువ పెంచే కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.

తెలుగుభాషాభివృద్ధికి ప్రభుత్వం చొరవ....

విద్యారంగంలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పేందుకు గత ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగానే తెలుగుభాషలో విద్యార్థులు రాణించేలా ప్రోత్సహిస్తోంది. ఆమేరకు మిర్రర్ ఇమేజ్ పాఠ్యపుస్తకాలను ప్రవేశపెట్టింది. ఈ విధానంతో ఆంగ్లంతోపాటు మాతృభాషపై ప్రాథమిక దశనుంచే పట్టు లభించింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సైతం తెలుగు భాషకు ప్రాధాన్యత నివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలుగు భాషాభిమానులు అందరూ కోరుతున్నారు.

తెలుగుభాషను కాపాడుకుందాం...



తెలుగుభాషను కాపాడుకునేందుకు తెలుగువాళ్లంతా ప్రయత్నించాలి. తెలుగులో చదువుకున్నవారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యతనివ్వాలి. తల్లి భాషను కాపాడుకుంటూ ఇతర భాషలపై పట్టు సాధించడం చేద్దాం. ముఖ్యంగా నామ ఫలకాలను సైతం తెలుగులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. దీనిపై మేము ఎన్నో ప్రయత్నాలను చేస్తున్నాం.

తులసీనాథం నాయుడు, తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్షుడు, పలమనేరు

సమాజంలోనూ మార్పు రావాలి..



తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చకుండా చిన్నప్పుడే ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో చేర్చుతున్నారు. పిల్లలచే అమ్మ నాన్న అని పిలిపించుకోవడం నామోషీగా మారింది, మమ్మీ డాడీ సంస్కృతి పెరుగుతోంది. ఉన్నత చదువులు చదివిన తెలుగువారికి తెలుగును స్పష్టంగా చదవడం, రాయడం రావడం లేదు. అందుకే ప్రభుత్వం తెలుగు భాషాభివృద్ధికి పెద్దపీట వేస్తోంది.

బాలాజి, జిల్లా రచయితల సంఘ నాయకులు, పలమనేరు

సాహితీరంగంలో కవులకు సన్మానం



కవులను సన్మానిస్తున్న రచయిత సంఘం సభ్యులు

పుంగనూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన సాహితిరంగంలో పుంగనూరుకు చెందిన పలువురు కవులకు సన్మాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులోభాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి పలు మండలాల నుంచి ప్రసిద్ధ కవులు, రచయితలకు తెలుగుభాష దినోత్సవ సందర్భంగా కట్టమంచి బాలకృష్ణారెడ్డి మ్యాంగో భవనంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గిరిధరన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఎంతో మంది కవులు, రచయితలు, గాయకులు ఉండడం జిల్లా చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. తెలుగుభాష గొప్పతనం అంశాలపై కవితలో వినిపించారు.

ఇందులోభాగంగా పుంగనూరుకు చెందిన రచయితలు, కవులు సతీష్‌కుమార్, హసీనాబేగం, జమున తెలుగుభాష సాహిత్య కవితలను కనబరచడం ఎంతో విశేషమని వారిని కొనియాడారు. అలాగే కవులను శాలువలతో సన్మానించి, ప్రశంసాపత్రాలు అందజేశారు.

క్రీడల్లో డిగ్రీ కళాశాల విద్యార్థుల సత్తా



విజేత విద్యార్థులతో ప్రిన్సిపల్

పుంగనూరు: ఈనెల 24న ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ పోటీలను అండర్ 23 విభాగంలో తిరుపతి ఎస్‌వీయూ తారాకరామ స్టేడియంలో నిర్వహించారన్నారు. ఇందులో జయలక్ష్మి లాంగ్‌జంప్ పోటీల్లో ప్రథమస్థానం కైవసం చేసుకుందన్నారు. 100 మీటర్లు, 200 మీటర్ల రన్నింగ్ రేసులో కూడా జయలక్ష్మి ప్రథమ, ద్వితీయస్థానం కైవసం చేసుకుందన్నారు. అలాగే హిమశ్రీ అండర్ 20 విభాగంలో షాట్‌పుట్‌లో తృతీయస్థానం, అండర్ 18 విభాగంలో 200 మీటర్ల రన్నింగ్‌లో తృతీయ స్థానం కూవసం చేసుకుందన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపకులు రామ్‌కుమార్, అనిల్ కుమార్, టి.రాజశేఖర్ అభినందించారు.

దాతలు ముందుకు రావడం అభినందనీయం





దాత అందించిన కంప్యూటర్లు, దాత దశరథరెడ్డి

కార్వేటినగరం: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని ఆర్కే ఎస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.స్వరూప అన్నారు. మంగళవారం వి.కోటకు చెందిన అమ్మాక్ సహకార సేవా సంస్థ సీఈఓ దశరథరెడ్డి రూ.2.50 లక్షల విలువచేసే 10 కంప్యూటర్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు కంప్యూటర్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె పేర్కొన్నారు. విద్యాభివృద్ధి పట్ల అభిమానం కలిగిన దాతలు ఉండడం పేద విద్యార్థులకు వరమని ఈసందర్భంగా ఆమె అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల నమోదు చేసుకోవాలి

సదుం: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించాలని ఏఓ హరిప్రసాద్ సూచించారు. నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే బీమా వర్తిస్తుందన్నారు. ఏదైనా విపత్తు సంభవిస్తే పంట నష్టపరిహారం వస్తుందన్నారు. ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందన్నారు. కావున రైతులు తమ వివరాలను రైతు సేవా కేంద్రాల్లో అందజేసి, పొలాలకు వచ్చినపుడు పంట వివరాలను నమోదు చేయించాలన్నారు.

వాహనాల వేలం రేపు

పలమనేరు: కర్ణాటక మద్యం కేసుల్లో స్థానిక సెబ్ అధికారులు సీజ్ చేసిన వాహనాలను స్థానిక ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఈనెల 29న ఉదయం 9 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ సురేష్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా డిపాజిట్ చెల్లించి ఆపై వేలంలో పాల్గొనాలని సూచించారు.

నేడు సామాజిక తనిఖీ విచారణ

పలమనేరు: పలమనేరు మండలంలో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31దాకా జరిగిన ఉపాధి పనులకు సంబంధించి పట్టణంలో ఎంపీడీఓ కార్యాలయం వెనుకవైపునున్న ఉపాధి కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ బహిరంగ విచారణ కార్యక్రమం నేడు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమేరకు ఈ పనులపై ఈనెల 19 నుంచి 27దాకా పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం విచారణ చేసి పలు అక్రమాలను గుర్తించారని తెలిపారు. వీటిపై నేడు బహిరంగ విచారణ ఉంటుందని అందులో పేర్కొన్నారు. ఇందుకు డ్వామా, డీఆర్‌డీఏ అధికారులతో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు హాజరు కానున్నట్లు అందులో తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



దుకాణదారులకు సూచనలిస్తున్న సీఐ

చౌడేపల్లె: దుకాణాల్లో నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ రామ్‌భూపాల్ దుకాణదారులను కోరారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో దుకాణదారులతో సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ ప్రజా భద్రతా చట్టం 2013 ప్రకారం వ్యక్తిగత భద్రత, ఆస్తి సంరక్షణ కోసం కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనదారులు వారి వాహనాల భద్రత దృష్ట్యా జీపీఎస్‌ను ఏర్పాటు చేయడం వలన అనేక ప్రయోజనాలున్నాయని వివరించారు. గ్రామంలో అనుమానితులు సంచరించినా, అనుమానాస్పదంగా వ్యవహరించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఏఎస్‌ఐ వాసు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



పోలీసు అధికారులతో సమావేశమైన సివిల్ జడ్జి లిఖిత

–జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

పలమనేరు: పట్టణ సమీపంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సెప్టెంబర్ 14న జరిగే జాతీయలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి ఎం లిఖిత తెలిపారు. స్థానిక కోర్టులో సీఐలు, ఎస్‌ఐలు, ఇతర సంబంధిత శాఖల అధికారులు, న్యాయవాదులతో ఇందుకు సంబంధించిన సమావేశాన్ని ఆమె మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గం కాబట్టి కక్షిదారులు అనవసరమైన పంతాలకు పోకుండా కేసులను రాజీ చేసుకుని శాంతిపూర్వకంగా జీవించాలన్నారు. ఇందులో ప్రిలిటికేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చునని సూచించారు. చెక్‌బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేందుకు ఇది మంచి అవకాశమన్నారు. కక్షిదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. ముఖ్యంగా పోలీసులు పెండింగ్ కేసుల రాజీకి కృషి చేయాలని సూచించారు. సీఐ మురళీమోహన్, ఎస్‌ఐ స్వర్ణతేజ, బార్ అధ్యక్షులు లక్ష్మీపతి, పరమశివప్ప పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్లు పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

వి.కోట: ఇళ్ల నిర్మాణాల పనులను అర్ధంతరంగా నిలిపివేసిన వారు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మహ్మద్ రఫీ సూచించారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ఇంజినీర్‌లు, హౌసింగ్ అధికారులు, ఉపాధి సిబ్బంది, వెలుగు సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు బకాయి ఉన్న బిల్లులను త్వరితగతిన అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే ఉపాధి హామీకి సంబంధించి 90 రోజుల పనిదినాల వేతనాలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. వెలుగు గ్రూపుల ద్వారా లోన్లు మంజూరు చేసి లబ్ధిదారులకు ఆర్థికంగా అభివృద్ధి చేస్తే ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడానికి వీలవుతుందన్నారు. హౌసింగ్ ఏఈ, ఉపాధి హామీ అదనపు ప్రోగ్రాం అధికారి, వెలుగు అదనపు ప్రాజెక్ట్ మానిటరింగ్ అధికారి పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న మేనేజర్ కృపానంద్



హాజరైన ఖాతాదారులు

గంగవరం: ఖాతాదారులకు పలు రకాల సేవలను సప్తగిరి గ్రామీణ బ్యాంకులో కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చినట్టు బ్రాంచ్ మేనేజర్ కృపానంద్ తెలిపారు. గంగవరం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కొత్తగా అందుబాటులోకి తెచ్చిన సేవలు, వడ్డీ వివరాలను ఆయన వివరించారు. మేనేజర్ మాట్లాడుతూ డిపాజిట్లపైన అత్యధిక ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను తమ బ్యాంకులో ఖాతాదారులకు అందిస్తున్నట్టు తెలిపారు. ఈనెల మొదటి తేదీ నుంచి తమ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, రీ–ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్, షార్ట్ టర్మ్ డిపాజిట్ ప్లాన్ ఇలా పలు రకాల సేవలను అమల్లోకి తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. వీటికి సంబంధించిన వివరాలన్నింటినీ ఖాతాదారులకు వివరించి నిర్ణయించిన గడువు వరకు డిపాజిట్లు చేసిన ఖాతాదారులకు అధిక వడ్డీ రేట్లు జమచేసి చెల్లిస్తామని తెలిపారు. వివరాల కోసం గంగవరంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకులో మేనేజర్‌ను సంప్రదించాలన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



పూజలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని పట్టణ పరిధిలోని దాసార్లపల్లిలో వెలసిన కాశీ విశ్వేశ్వరాలయంలో శ్రీకృష్ణున్ని కొలువుదీర్చి మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారుల కృష్ణుడు, గోపికల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కమనీయం..కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలో వెలసిన శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి కమనీయంగా కల్యాణం నిర్వహించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ముస్తాబు చేశారు. వేదపండితులతో హిందూ సంప్రదాయ రీతిలో మేళ తాళాల నడుమ భక్తి పారవశ్యంతో కల్యాణోత్సవం చేశారు. పెద్ద సంఖ్యలో హాజరైనభక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి ధన్యులయ్యారు.

దాసార్లపల్లెలో తాగునీటి ఎద్దడి

బైరెడ్డిపల్లె: మండలంలోని కంభంపల్లె సచివాలయ పరిధిలోని దాసార్లపల్లె ఎస్సీ కాలనీలో తాగునీటికి కటకటలాడుతున్నట్లు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి వేసిన బోర్లు మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సమస్య ఏర్పడినట్లు వాపోతున్నారు. గత నెల రోజులుగా తాగు నీటి సమస్యపై అధికారులకు చెబుతున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. బోరులో నీరు పుష్కలంగా ఉన్నా బోరు మరమ్మతులు చేయించక నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. గ్రామ సమీపంలోని వ్యవసాయ బోర్లను ఆశ్రయించి పంట పొలాల్లో నీటిని తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. కనీసం ట్యాంకర్ల ద్వారానైనా తాగునీటి సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై సచివాలయ కార్యదర్శి మహేష్‌ను వివరణ కోరగా లో ఓల్టేజీ సమస్యతో బోరు మోటారు మరమ్మతులకు గురైందని, త్వరలోనే మరమ్మతులు చేయిస్తామన్నారు.



పొలాల వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు